క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలో చిన్నపుర్లి గ్రామంలో చిన్మయిదేవి సహిత చిదంబరేశ్వస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జోష్యుల కూర్మనాథ శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్, దీక్షాకంకణధారణ, అఖండ దీపారాధన, అంకురారూపణ, యాగశాల ప్రవేశం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పార్వతమ్మ, ఆదినారాయణలతో పాటు గ్రామస్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



బుల్లిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలో లచ్చారాయపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోర బుల్లిబాబును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం పరామర్శించారు. బుల్లిబాబు భార్య విజయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని సంతాపం తెలిపారు. విక్రాంత్ వెంట వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, పాలవలస ధవళేశ్వరరావు, సర్పంచ్‌లు సవళాపురపు రమేష్‌నాయుడు, కరణం గోవిందరావు, గార రమణ, కెంబూరి వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, ఎంపీటీసీ పిల్లా గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో వ్యవహరించాలి



రాజాం సిటీ: వివిధ పార్టీల నాయకుల మాట్లాడుతున్న ఆర్‌ఓ జోషఫ్

రాజాం సిటీ: రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో వ్యవహరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోషఫ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ ఎస్‌కే రాజు, డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

తెర్లాం: జిల్లాకు చెందిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ ఆకాంక్షించారు. జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులను మంగళవారం ఆయన అభినందించారు. ఇటీవల మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర జట్టు తరుపున పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు విజేతగా నిలిచింది. జాతీయ స్థాయి పోటీలో అత్యుత్తమ ఆటతీరు కనబరిచిన క్రీడాకారులను ఆయన అభినందించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని 6243 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.1.89 కోట్ల మొత్తాన్ని ఈనెల 4,5,6 తేదీల్లో పంపిణీ చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు గ్రామ సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నడవలేని దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని కోరారు.

ప్రజలు శాంతియుతంగా మెలగాలి



కొండగూడేం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై షేక్ శంఖర్

సంతకవిటి: ప్రజలు శాంతియుతంగా మెలగాలని ఎస్సై షేక్ శంఖర్ అన్నారు. మండలంలోని కృష్ణంవలస, కొండగూడేం గ్రామాల్లో మంగళవారం పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. గుంపులుగా తిరగరాదని, వివాదాస్పద వాఖ్యలు చేయరాదని సూచించారు. సీ-విజిల్, సువిధ యాప్‌ల వినియోగాన్ని వివరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే

- నియోజకవర్గంలో భారీ మెజారిటీ ఖాయం
- రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్



పటువర్ధనంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న తలే రాజేష్



శ్రీహరిపురం ఆర్‌ఆర్ కాలనీలో మంచంపై ఉన్న రోగిని పరామర్శిస్తున్న తలే రాజేష్

వంగర: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని, మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ అన్నారు. మండలంలోని పటువర్ధనం, శ్రీహరిపురం, శ్రీహరిపురం ఆర్‌ఆర్ కాలనీ, కింజంగి ఆర్‌ఆర్ కాలనీల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మంగళవాయిద్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. పలువురు వృద్ధులు, దివ్యాంగులు, రోగులను ఆప్యాయంగా పలకరించారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న సూర్యనారాయణరాజు

అమ్మా బాగున్నారా..

వంగర: అమ్మా బాగున్నారా.. బాబూ బాగున్నారా.. సోదరా బాగున్నారా.. తల్లీ బాగున్నారా.. అంటూ వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు(పులిరాజు) ఆప్యాయతతో ఓటర్లను పలకరించారు. రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయతతో పలకరించారు. అందరం కలిసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని అభ్యర్థించారు.

అడుగడుగునా జనం నీరాజనం

ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. నుదుటన తిలకం దిద్ది, హారతి ఇచ్చి స్వాగతం పలికారు. అంతకుముందు పటువర్ధనంలో 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. నల్ల సింహాచలం, తోరిక గోవిందరావు, తోరిక వెంకటరమణ, తోరిక రమణదొర, నారాయణదొర, దుర్గం దొర తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు(పులిరాజు), ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు తెంటు జోగినాయుడు, గార శిమ్మినాయుడు, శనపతి సత్యారావు, బెజ్జిపురం విజయ్‌కుమార్, కనగల పారినాయుడు, బూరాడ వెంకటరావు, బొక్కేల వెంకట అప్పలనాయుడు, కాబోతుల శ్రీనువాసునాయుడు, బొత్స ప్రవీణ్, గార విష్ణు, బొంతు వెంకటరావు, వేమిరెడ్డి సూర్యనారాయణ, చందక తాతబాబు, నల్ల కృష్ణ, తెంటు కుమారి, రెడ్డి సీతంనాయుడు, కిమిడి సన్యాసినాయుడు, చింతగుంట రామారావు, తదితరులు పాల్గొన్నారు.



రాజాం: తెలగవీధిలో తలే రాజేష్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న అతని సోదరి రమ్య, పార్టీ నాయకులు

అన్నయ్యకు తోడుగా..

రాజాం: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. రాజాం పట్టణంలోని సత్యనారాయణపురం, తెలగవీధి వార్డుల్లో మంగళవారం రాజేష్‌కు మద్దతుగా అతని చెల్లి తలే రమ్య, ఆమె బంధువులు ప్రచారం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తున్నారని, కొత్త వారికి అవకాశాలు ఇస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే తమ సోదరుడు రాజేష్‌కి రాజాం టిక్కెట్ ఇచ్చారన్నారు. మీరంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మా అన్నను ఆశీర్వదించాలని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రచారంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, ప్రేమ్‌కుమార్, పార్టీ అధికార ప్రతినిధి ఆసపు సూర్యం, కోల్లా రమ్య, అల్లెన జయలక్ష్మి, యందవ సుశీల, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం



శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

తెర్లాం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆసక్తిగా చదివే పుస్తకాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ.. ఏటా ఏప్రిల్ 2న అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానమన్నారు. బాలలు చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. పుస్తకాలు చదవడం ద్వారా బాధపడేవారికి ఓదార్పును, అలసిన మనసులకు సేదతీర్చుతుందని చెప్పారు. బాలలను ఆకర్షించే అనేక నీతి కథల పుస్తకాలు, కార్టూన్‌లు, బొమ్మల పుస్తకాలు ఎన్నో ఉన్నాయని, వాటిని తల్లిదండ్రులు తమ పిల్లలకు చూపించాలన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉన్న చిన్నారుల పుస్తకాలను ఎప్పుడు వచ్చినా చదువుకొనేందుకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సంతకవిటి: మండలంలోని కొండగూడేం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆలుబెల్లి కిరణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సినీ గీతాలకు డాన్సులు చేస్తూ సందడి చేశారు.

ఆటిజం మానసిక సమస్య మాత్రమే..



మాట్లాడుతున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరరావు

బాడంగి: ఆటిజం అనేది వ్యాధి కాదని, అది ఒక మానసిక సమస్య అని ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం తెంటు వెంకటలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఆటిజంపై అవగాహన కల్పించేందుకు ఏటా ఏప్రిల్ 2న ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఆటిజానికి జన్యుపరమైన కారణాలతో పాటు లేటు వయసులో పిల్లలను కనడం, పోషకాహార లోపం, ఒంటరి తనం వంటి కారణాలు ఉన్నాయన్నారు. ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, ఇతర చికిత్సలతో పిల్లల మానసిక స్థితిని మెరుగుపర్చవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, శంకరరావు, నారెమ్మ, విజయమ్మ, కళ్యాణి, రామకృష్ణ, పీడీ బంగారునాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివాలయ ప్రతిష్ఠోత్సవాలు

బాడంగి: మండలంలోని డొంకినవలస, రైల్వే స్టేషన్ గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన శివాలయం ప్రతిష్ఠోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. తొలిరోజు వినాయక పూజ, హోమాలు ఉంటాయన్నారు. రెండో రోజు ధాన్యాధివాసం, సూర్యనమస్కారాలు, మూడో రోజు బింబాదివాసం, ఉత్సవ విగ్రహాల తిరువీధి, అనంతరం పూర్ణకుంభ, ధ్వజస్తంభ స్థాపన ఉంటాయన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిబంధనల మేరకు పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదనరావు

తెర్లాం: ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గతంలో మాదిరిగా గ్రామ వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయొద్దని ఈసీ ఆదేశించిందన్నారు. నడవలేని వృద్ధులు, రోగులకు ఇంటి వద్దనే పింఛన్ ఇవ్వాలని, మిగిలిన వారికి గ్రామ సచివాలయాల్లో పంపిణీ చేయాలని సూచించారు. పింఛన్ తీసుకునేందుకు వచ్చిన వారంతా తప్పనిసరిగా ఆధార్‌కార్డు, లేదా మరేదైనా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, పెన్షన్ పుస్తకం తీసుకురాకూడదని ముందుగా సమాచారం అందించాలన్నారు. పింఛన్ల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులంతా వెల్ఫేర్ అసిస్టెంట్లకు సహకరించాలని సూచించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు ఉన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు



సంతకవిటి: గుళ్లసీతారాంపురంలో బోరు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

రాజాం: వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కంచరాం గ్రామంలో పాడైన తాగునీటి బోర్లను మంగళవారం బాగుచేయించారు. క్రాస్‌ప్రోగ్రాం ద్వారా పాడైన తాగునీటి బోర్లను బాగుచేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం రూ.5 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. గ్రామాల్లో బోర్లు పాడైనట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఆయనతో పాటు సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు ఉన్నారు.

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో పాడైన తాగునీటి బోర్లను ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మంగళవారం బాగుచేశారు. క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు యలకల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బోర్ మెకానిక్‌లు కృపారావు, వెంకటరమణ, రామకృష్ణలు బోర్లుకు మరమ్మతులు చేపట్టారు.

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలోని సెగిడివీధి, ప్రధాన వీధుల్లో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను క్రాస్‌ప్రోగ్రాం కింద మంగళవారం బాగుచేశారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

పింఛన్ కష్టాల పాపం టీడీపీ నేతలదే..

రాజాం: వృద్ధులకు, దివ్యాంగులకు, డయాలసిస్ రోగులకు, ఇంటి నుంచి బయటకు రాలేని ఎంతో మంది అభాగ్యులకు ఇంటి వద్దే పింఛన్ డబ్బులు అందేవని, చంద్రబాబు అండ్ కో చేసిన నిర్వాకంతో వారంతా పింఛన్ డబ్బులు తీసుకునేందుకు పాట్లు పడాల్సిన పరిస్థితి వచ్చిందని వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు అన్నారు. రాజాం పట్టణంలోని గొల్లవీధిలో మంగళవారం డొప్ప కుటుంబీకులు నిర్వహించిన గంగమ్మ తల్లి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. డొప్ప కుటుంబీకులతో కలిసి సంబరాల్లోని పలు కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రతీ నెల 1వ తేదీన గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించేవారని వివరించారు. లబ్ధిదారులపై కక్ష సాధింపు చర్యలో భాగంగా టీడీపీ నేత చంద్రబాబునాయుడు వలంటీర్లు పింఛన్ పంచకుండా నిలుపుదలచేశారని ఆరోపించారు. అవ్వతాతలు, దివ్యాంగులు సచివాలయాలకు వెళ్లి క్యూలో నిలబడాల్సిన పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. ఆయన వెంట పార్టీ అధికార ప్రతినిధి ఆసపు సూర్యం, సచివాలయ కన్వీనర్ సింబాల రాము, యాదవ సంఘ సభ్యులు సింహాచలం తదితరులు ఉన్నారు.

గంగమ్మతల్లికి అరటి గెలల తోరణం



రాజాం: గంగమ్మ సంబరాల్లో అరటిగెలల తోరణం



వంగర: పూజలు చేస్తున్న యాదవులు

రాజాం: మున్సిపాలిటీ పరిధి 21వ వార్డు గొల్లపేటలో గంగమ్మతల్లి సంబరాలు మంగళవారం వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి యాదవులంతా ఇక్కడకు చేరుకుని డొప్ప కుటుంబీకులు నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు గంగమ్మకు అరటి గెలలు, చీరలు సమర్పించారు. పందిరిలో తోరణాలుగా కట్టిన అరటిగెలలు ఆకట్టుకున్నాయి.

వంగర: మండల కేంద్రం వంగరలో గంగమ్మతల్లి పండుగ(గావు పండుగ) మంగళవారం ఘనంగా జరిగింది. యాదవులు ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. తప్పెటగుళ్ల కళాకారులు గంగమ్మతల్లి జీవిత చరిత్రను గీతాలుగా ఆలపించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



రాజాం సిటీ: గడిముడిదాంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



రేగిడి: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు



రామభద్రపురం: రొంపల్లివలస గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై జ్ఞానప్రసాద్

రాజాం సిటీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలు శాంతియుతంగా మెలగాలని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు కోరారు. మండలంలోని గడిముడిదాం, దోసరి, ఆగూరు, కంచరాం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాజకీయంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, కేంద్ర బలగాలతో కలిసి ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలి

రేగిడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని, ఎటువంటి వివాదాలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలో సంకిలి గ్రామంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. మద్యం పంపిణీపై నిఘా పెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరి పట్టాభి, ఎంపీటీసీ మజ్జి సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు

రామభద్రపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎస్సై జ్ఞానప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని దుప్పలపూడి పంచాయతీ మధురగ్రామమైన రొంపల్లివలసలో మంగళవారం పర్యటించారు. గ్రామస్తులు గొడవలకు పోకుండా సోదరభావంతో మెలగాలని, ఎన్నికలను సజావుగా నిర్వహించేలా పోలీసులకు సహకరించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

ఉపాధి పనుల వద్ద జాగ్రత్తలు పాటించాలి



రామభద్రపురం: రామభద్రపురంలో ఉపాధి పనికి వెళ్లివస్తున్న వేతనదారులు

రామభద్రపురం: వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధిహామీ పనుల నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఏపీఓ జి.త్రినాథ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో 10,500 మంది వేతనదారులు ఉండగా.. ప్రస్తుతం 2,600 మంది పనులకు హాజరవుతున్నారని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 6 గంటలు నుంచి 10.30 గంటలు వరకు, మధ్యాహ్నం 3 గంటలు నుంచి 5 గంటలు వరకు పనిచేయాలని సూచించారు. రోజువారీ గరిష్ఠ వేతనం రూ.300లకు పెంచడం జరిగిందన్నారు. పని కావాలని డిమాండ్ పెట్టిన తర్వాత రాకుండా ఉండిపోతే 100 పని దినాల్లో వారం రోజులు పోతాయని తెలిపారు.

రేగిడి: ఎండ తీవ్రత అధికంగా ఉందని, ఉపాధి వేతనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాధరావు సూచించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధిపనులను మంగళవారం ఆయన పరిశీలించారు. 400 మంది వేతనదారులు పనులు చేస్తున్నట్లు గుర్తించారు. రెండు పూటలా పనులు చేస్తే కనీసం వేతనం రూ.300లు వస్తుందన్నారు. తాగునీటిని, మెడికల్ కిట్లును అందుబాటులో ఉంచాలని టెక్నికల్ అసిస్టెంట్ ఆనందరావు, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామిబాబుకు సూచించారు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం



రాళ్లు తేలిన సోమిదవలస రోడ్డు (నాడు)



రూ.98 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు (నేడు)

తెర్లాం: మండలంలోని సోమిదవలస జంక్షన్ నుంచి పణుకువలస వరకు ఉన్న రోడ్డు రూ.98 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించడంతో సోమిదవలస, పణుకువలస గ్రామాల ప్రజలు పడిన ఇబ్బందులు తొలగిపోయాయి. గత టీడీపీ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు. రోడ్డంతా రాళ్లు తేలిపోయి కనీసం నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్డు అధ్వాన్నంగా ఉన్న విషయాన్ని గ్రామ సర్పంచ్ చందక సత్యనారాయణ, గ్రామస్తులు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించి వారు రోడ్డు పనులు చేపట్టేలా సంబంధిత అధికారులను ఆదేశించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. సుమారు రూ.98 లక్షలతో సోమిదవలస జంక్షన్ నుంచి పణుకువలస వరకు బీటీ రోడ్డు నిర్మించారు. రోడ్డు బాగుపడడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు, ప్రయాణీకులు ప్రభుత్వానికి, జెడ్పీ చైర్మన్, బొబ్బిలి ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.